సాక్షి
మహబూబాబాద్
మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025



ఆధునిక జీవనం సమస్యలమయం
ఉదయం నుంచి రాత్రి పడుకునే వరకు అనేక మంది యువత మొబైల్‌లో ఇంటర్‌నెట్‌పైనే ఆధారపడుతున్నారు. - 8లో▸



ఆదివాసీ సంస్కృతి ప్రతిబింబించేలా.. - 8లో▸
ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా అమ్మవార్ల గద్దెల విస్తరణ చేపట్టనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు.

గరిష్టం/కనిష్టం
35.2°/23.2°
వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

‘ప్రజాపాలన’ ముఖ్య అతిథిగా రాంచంద్రునాయక్



సాక్షి, మహబూబాబాద్: ప్రభుత్వం ఈ నెల 17న అధికారికంగా నిర్వహించే ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకలకు రాంచంద్రునాయక్ హాజరై జాతీయ పతాకావిష్కరణ చేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి విప్ మాట్లాడనున్నారు.

వచ్చే నెల 4న ఐఆర్‌సీఎస్ సర్వసభ్య సమావేశం

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సర్వ సభ్య సమావేశం వచ్చే నెల 4న నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఐఆర్‌సీఎస్ కార్యవర్గం, ఎజెండాలోని పలు అంశాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. సభ్యులు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

విద్యుత్ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలి



నెహ్రూసెంటర్: విద్యుత్ కాంట్రాక్టర్లకు పనులు ముగిసిన వెంటనే బిల్లులు చెల్లించాలని విద్యుత్ కాంట్రాక్టర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు బందు సైదులు అన్నారు. విద్యుత్ కాంట్రాక్టర్లు సోమవారం విద్యుత్‌శాఖ జిల్లా ఎస్‌ఈ విజయేందర్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరుగుతుందని, రేట్ల పెంచాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నామని తెలిపారు. ఏడు సంవత్సరాలుగా రేట్ల పెంపు జరగలేదని ఆయన పేర్కొన్నారు. నేటి నుంచి సమ్మెలో ఉంటామని పనులను చేపట్టబోమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు కుమార్, విశ్వేశ్వర్‌రావు, సోమిరెడ్డి, నరేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తిరుగుబాటు తప్పదు



కేసముద్రం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే, ప్రజల్లో తిరుగుబాటు తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.నాగయ్య హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రష్యా నుంచి చమురు దిగుమతి నిలిపివేయాలనే పేరుతో, భారతదేశం ఎగుమతులపై 50శాతం టారిఫ్‌లు పెంచాడన్నారు. యురోపియన్ దేశాలపై భారత ఎగుమతులపై సుంకాలు వంద శాతం పెంచాలని ఒత్తిడి తెస్తున్నాడన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రాజు, మార్తనేని పాపారావు, మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, నీరుటి జలేందర్, తాడబోయిన శ్రీశైలం, జల్లె జయరాజ్, నర్సయ్య, సావిత్ర, జాటోత్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ల గడువు పెంపు



మహబూబాబాద్ అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2025–26 విద్యా సంవత్సరానికి డిగ్రీ అడ్మిషన్ల గడువు ఈ నెల 26వరకు పెంచినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్ నాయక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో సోమవారం ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ల వాల్ పోస్టర్‌ను అధ్యాపక బృందం ఆవిష్కరించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఇంటర్, ఐటీఐ, పాలిసెట్, ఓపెన్ ఇంటర్ పాసైన విద్యార్థులు ప్రవేశాలకు అర్హులన్నారు. డిగ్రీలో బీఎస్సీ సైన్స్, మ్యాథ్స్, బీకాం, బీఏ గ్రూపులు ఉన్నాయని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 500తో అడ్మిషన్ పొందవచ్చన్నారు. పూర్తి వివరాలకు 7382929705 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సర్దుబాటులో నిర్లక్ష్యం

- పలు పాఠశాలల్లో వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- ఇష్టారాజ్యంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేశారని ఆరోపణలు
- విద్యాపరంగా నష్టపోతున్న విద్యార్థులు



‘మానుకోట మున్సిపాలిటీ పరిధి గాంధీపురం ఎంపీపీఎస్‌లో ఐదుగురు ఉపాధ్యాయుల్లో నలుగురు పదోన్నతులపై వెళ్లారు. ఉన్న ఒక ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం ఒకటో తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు బోధిస్తున్నారు. మొత్తం 54మంది విద్యార్థులకు చదువుతున్నారు. కాగా, హెచ్‌ఎం కాంప్లెక్స్ సమావేశాలు, జూమ్ మీటింగ్‌కు హాజరుకావడం, ఎండీఎం అప్‌డేట్ చేయడం, ఎఫ్‌ఆర్‌ఎస్ ఇలా రకరకాల విద్యా సంబంధమైన డ్యూటీలు వేస్తున్నారు. ఈ క్రమంలో పాఠశాలకు సెలవు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు తక్షణమే స్పందించి ఇతర పాఠశాలల నుంచి డిప్యుటేషన్ పై ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.’

మహబూబాబాద్ అర్బన్:

ఇటీవల ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి బదిలీలు చేశారు. కాగా అవసరం మేరకు ఆయా జిల్లాల్లో టీచర్ల సర్దుబాటు ప్రక్రియను సెప్టెంబర్ 4వ తేదీలోపు పూర్తి చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డీఈఓలను ఆదేశించారు. కలెక్టర్ల ఆమోదంతో ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. గతంలో జూలై 15లోపు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసినా.. ఆ తర్వాత పదోన్నతులు, బదిలీల అంశం తెరపైకి రావడంతో అనేక జిల్లాల్లో టీచర్ల సర్దుబాటు పెండింగ్‌లో పడింది. పదోన్నతుల ప్రక్రియ పూర్తి కావడంతో తాజాగా మరోసారి ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

ఆరోపణలు..

జిల్లాలో 676 ప్రైమరీ పాఠశాలలు ఉండగా.. 19,213 మంది విద్యార్థులు చదువుతున్నారు. 120 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా 5,354 మంది విద్యార్థులు చదువుతున్నారు. 102 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా 13,497 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో 3,281 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.




గాంధీపురం ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులు

కాగా జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉన్నచోట విద్యార్థులు లేక, విద్యార్థులు ఉన్నచోట ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాగా, జిల్లా విద్యాశాఖ నెల రోజుల క్రితం 84మంది ఉపాధ్యాయులతో సర్దుబాటు చేసింది. అయితే ఎంఈఓలు నిర్లక్ష్యంగా, ఇష్టారాజ్యంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారని, జాబితాను తప్పుల తడకగా రూపొందించారని పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఈసారైనా సక్రమంగా జరిగేనా..

ఈ విద్యా సంవత్సరం ఉపాధ్యాయుల సర్దుబాటు మొదట జరిగిన జిల్లాలో పదోన్నతులపై సుమారు 90మంది ఉపాధ్యాయులు ఇతర పాఠశాలలకు వెళ్లిపోయారు. అదేవిధంగా సర్దుబాటు చేసిన డీఈఓ కూడా పదవీ విరమణ పొందారు. నూతనంగా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అధికారికి సర్దుబాటు విషయ తలనొప్పిగా మారింది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మొత్తం 18 సబ్జెక్టులను బోధించడానికి విద్యార్థులకు అనుగుణంగా మొత్తం నలుగురు ఉపాధ్యాయులతో ఒక హెచ్‌ఎం ఉండాలి. గత డీఈఓ, విద్యాశాఖ అధికారులు చేసిన తప్పులు ఈసారి సరిదిద్దుకుంటారో లేదో వేచిచూడాలి. ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాలతో సర్దుబాటు



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గతంలో మాదిరిగా ఉపాధ్యాయుల సర్దుబాటు విషయంలో తప్పిదాలు జరగకుండా ఈసారి విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తాం.

- దక్షిణామూర్తి, డీఈఓ

పోలీస్ తిప్పలు!

- యూరియా పంపిణీలో జాగారం
- ఉదయం నుంచి సాయంత్రం వరకు డ్యూటీలు
- కొరతపై నిఘా వర్గాలతో నివేదిక
- పంపిణీలో మార్పులు, చేర్పులు



జంగిలిగొండలో లారీ వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

సాక్షి, మహబూబాబాద్: రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలు అందించే వ్యవసాయశాఖ.. ఈ ఏడాది సీజన్‌కు ముందు నుంచే యూరియా పంపిణీలో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈక్రమంలో ఆగస్టు మొదటి వారం నుంచి పోలీసులు లేనిదే యూరియా పంపిణీ చేయలేమని వ్యవసాయశాఖ అధికారులు తేల్చి చెప్పారు. దీనికి తోడు రోజురోజుకూ సమస్య జఠిలం కావడం.. ఎక్కడ లేని సమస్య జిల్లాలోనే ఉండడంతో యూరియా పంపిణీ అధికారులకు సవాల్‌గా మారింది. ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు వచ్చేలా వ్యవహారం ముదరడంతో.. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చొరవ తీసుకునే వరకు వెళ్లింది. దీంతో యూరియా పంపిణీ శాంతి భద్రతల సమస్య వరకు దారి తీయడం.. అందులో రైతుల సమస్య కావడంతో పోలీస్‌శాఖకు అగ్ని పరీక్షగా మారింది.

రోజుకో చోట సమస్య..

యూరియా పంపిణీలో సమస్యను ఒకచోట చక్కదిద్దితే మరోచోట ఇబ్బంది జరిగే పరిస్థితి ఉంది. ఇలా జిల్లాలో యూరియా కోసం వచ్చిన రైతులు కింద పడిపోవడం, తలకు గాయాలు కావడం.. మరో చోట ప్రమాదానికి గురై మృతి చెందడం, ఇంకోచోట యూరియా లారీపై రైతులు దాడి చేసి యూరియా బస్తాలు తీసుకెళ్లే ప్రయత్నం చేయడం.. క్యూలో రైతులు గొడవలు పెట్టుకోవడం.. మహిళల సిగపట్లు.. మొదలైన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వీటిని అదుపు చేయడం కోసం పోలీసుల పహారా మధ్య టోకెన్లు, యూరియా బస్తాల పంపిణీ చేయాల్సి వస్తోంది.

పోలీసుల జాగారం..

ఒక వైపు యూరియా ఎప్పుడు వస్తుందో.. టోకెన్లు ఎప్పుడు ఇస్తారో అనే ఆలోచనతో రైతులు పీఏసీఎస్ సెంటర్లు, ఆగ్రోస్, రైతు వేదికల వద్ద రాత్రంతా పడుకొని జాగారం చేస్తున్నారు. వీరితోపాటు పోలీసులు కూడా అక్కడే డ్యూటీలు చేస్తున్నారు. టోకెన్లు, యూరియా పంపిణీ వద్ద బందోబస్తు కోసం.. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌తోపాటు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు తేడా లేకుండా యూరియా పంపిణీ కేంద్రాల వద్ద డ్యూటీలు చేస్తున్నారు. యూరియా అనేది అతిపెద్ద సమస్యగా పరిగణించి.. రోజు ఉదయం పోలీసులు కాన్ఫరెన్స్‌లో చర్చించుకొని పరిస్థితిని అంచనా వేసి డ్యూటీలు వేస్తున్నారు. అయితే పదిహేను రోజుల నుంచి యూరియా పంపిణీ పనిలోనే పోలీసులు ఉండడంతో ఇతర కేసుల కోసం స్టేషన్‌లో నామమాత్రం సిబ్బందికి డ్యూటీలు వేస్తున్నారు.

రంగంలోకి నిఘా వర్గాలు..

రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా చేస్తున్నామని వ్యవసాయ, సహకార శాఖల అధికారులు చెబుతున్నా.. సమస్య సద్దుమణగపోవడంతో అసలేం జరుగుతుందనే విషయంపై జిల్లా పోలీస్‌శాఖ నిఘా వర్గాలను రంగంలోకి దింపినట్లు సమాచారం.. సమస్య తీవ్రంగా ఉన్న మరిపెడ ఏడీఏ పరిధితోపాటు, ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టారు. ఆగస్టు 28 వరకు పీఏసీఎస్‌లు, ఆగ్రోస్, ఇతర కేంద్రాల్లో ఇష్టారాజ్యంగా బస్తాలు ఇచ్చారు. ఇందులో రైతులే కాకుండా దళారులకు కూడా బస్తాలు ఇచ్చారు. దీంతో నిజమైన రైతులకు యూరియా అందలేదని గుర్తించినట్లు తెలిసింది. దీనిని అదుపు చేసేందుకు రైతు బంధు జాబితాను ముందు పెట్టుకొని పట్టాదారుపాస్ పుస్తకాలు, ఆధార్ కార్డును పరిశీలించి రైతు వేదికల్లో టోకెన్లు ఇచ్చి.. రైతుల జాబితాను డిస్‌ప్లే చేసి యూరియా పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టారు. డబ్బులు తీసుకోవడం మినహా.. టోకెన్లు ఇవ్వడం, బస్తాల పంపిణీ, రైతుల సమన్వయం చేసే పని అంతా పోలీసులే చేయడం మొదలు పెట్టారు. దీంతో గతంతో పోలిస్తే సమస్య కాస్త సద్దుమణిగిందని అధికారులు చెబుతున్నారు.

షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలి

- నామాలపాడు ఏకలవ్య పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

బయ్యారం: షెడ్యూల్ ప్రకారం పాఠశాలలో సిలబస్ పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని నామాలపాడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కిచెన్, డైనింగ్‌హాల్, మ్యూజిక్, తరగతి గదులను తనిఖీ చేసి అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. బోధనాంశాలతో పాటు సబ్జెక్టుల్లో విద్యార్థుల శక్తిసామర్థ్యాలను తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతుల్లో పాఠాలు బోధించాలని, విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలన్నారు. మెనూ ప్రకారం పరిశుభ్రమైన ఆహారం అందించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కలెక్టర్ వెంట పాఠశాల ప్రిన్సిపాల్ తదితరులు ఉన్నారు.



పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

నెహ్రూసెంటర్: ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరైన సమయంలో వైద్య చికిత్స అందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుతూ రోగులకు ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఫీవర్ వార్డు, పిల్లల వార్డులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆర్‌ఎంఓ జగదీశ్వర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి

- డీఈఓ దక్షిణామూర్తి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని డీఈఓ దక్షిణామూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలోని కేజీబీవీని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈఓ మాట్లాడుతూ.. నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించే విధంగా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం తరగతి గదులు, వంట గదులను పరిశీలించి, చిన్న చిన్న మరమ్మతులు చేసుకోవాలన్నారు. జీసీడీఓ విజయకుమారి, సైన్స్ అధికారి అప్పారావు, పాఠశాల ఎస్‌ఓ భవాని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ దక్షిణామూర్తి

డైలీ వేజ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్: గిరిజన ఆశ్రమ హాస్టల్ డైలీ వేజ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో డైలీ వేజ్ వర్కర్లు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా నాగన్న మాట్లాడుతూ.. గతంలో గిరిజన ఆశ్రమ హాస్టల్ డైలీ వేజ్ వర్కర్లకు కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించారన్నారు. 2021లో ఆర్థికశాఖ విడుదల చేసిన జీఓ నంబర్ 64 వల్ల వేతనాలు తగ్గాయన్నారు. వెంటనే ఆ జీఓను రద్దు చేసి, పాత పద్ధతిలోనే వేతనాలు ఇవ్వాలన్నారు. 212జీఓను సవరణ చేసి 2014 నాటికి ఐదు సంవత్సరాలు సర్వీస్ ఉన్న వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయాలన్నారు. నాయకులు కుర్ర మహేశ్, జ్యోతిబసు, మధు, వెంకన్న, మహేశ్, లింగ్యా, రవీందర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశ్రమ హాస్టల్ వర్కర్లు

నిట్‌లో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని బోస్ హాల్‌లో సోమవారం ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ మాట్లాడుతూ.. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజనీర్స్ డేగా నిర్వహించుకోవడం ఆయనకు మనం అందించే ఘన నివాళి అన్నారు. విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన సేవలను నిట్ విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఇందుకు గాను విశ్వేశ్వరయ్య జయంతిని ‘ఇంజనీరింగ్ ఐడియాస్ టు ఎంట్రప్రెన్యూరియల్ ఇంపాక్ట్’ అంశంతో జరుపుకుంటున్నట్లు తెలిపారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నిట్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీలినీడలు..

- చేప పిల్లల పంపిణీపై సందిగ్ధం
- ఇంకా పూర్తికాని టెండర్లు
- అదును దాటితే పిల్లలు పెరగవని ఆందోళన
- సొసైటీలకు నగదు అందించాలని మత్స్యకారుల డిమాండ్

తొర్రూరు రూరల్: మత్స్యకారులకు ఉపాధి కల్పించడంతో పాటు ఆర్థికంగా తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం ప్రవేశపెట్టింది. ఏటా టెండర్లు నిర్వహించి చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదులుతున్నారు. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు టెండర్లు నిర్వహించకపోవడంతో చేప పిల్లల పంపిణీ ఉంటుందా.. ఉండదా అని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. కాగా చేప పిల్లలకు బదులు సొసైటీలకు నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలో ప్రణాళిక ఇలా..

జిల్లాలోని సుమారు 1,000 చెరువులు, 220 కుంటల్లో 4.50కోట్ల చేప పిల్లలను ఈ ఏడాది వదిలేందుకు మత్స్యశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడం, నిధులు మంజూరు చేయకపోవడం చేప పిల్లల పంపిణీ టెండర్ ప్రక్రియ చేపట్టలేదు. కాగా అదును దాటితే చేప పిల్లల ఉత్పత్తి సరిగ్గా ఉండదని మత్స్యకారులు అంటున్నారు.



తొర్రూరు మండలంలో చేప పిల్లలను వదులుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి (ఫైల్)

నగదు బదిలీ చేయాలి..

టెండర్ ద్వారా అందించే చేప పిల్లలు నాసికరంగా ఉండడంతో ఎదగడం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. టెండర్లు దక్కించుకుంటున్న కాంట్రాక్టర్లు చేపపిల్లల్లో కోత విధిస్తున్నారని, చిన్న సైజు పిల్లలను ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తద్వారా తమ ఉపాధికి గండి పడుతుందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నగదు బదిలీ పథకాన్ని అమలు చేసి నేరుగా మత్స్య సొసైటీలకు డబ్బులు ఇవ్వాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

నగదు అందించాలి..



నగదు బదిలీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేసి సొసైటీలకు డబ్బులు అందించాలి. టెండర్ల ద్వారా ఉచితంగా ఇస్తున్న చేప పిల్లలు సరైన సైజు ఉండడం లేదు. తక్కువగా పిల్లలు వస్తున్నాయి. తద్వారా మత్స్యకారులకు ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదు. వెంటనే ప్రభుత్వం స్పందించి నగదు చేయాలి.

- కొత్తూరు రమేశ్, ముదిరాజ్ సంఘం నాయకుడు

త్వరలో పంపిణీ చేస్తాం



జిల్లా వ్యాప్తంగా ఉచిత చేప పిల్లలను త్వరలో పంపిణీ చేస్తాం. ఈనెలలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి చేప పిల్లలను చెరువులు, కుంటల్లో వదిలేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మత్స్య సొసైటీ ప్రతినిధులు, మత్స్యకారులు ఆందోళన చెందవద్దు.

-శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి

ప్రణాళికతో నియోజకవర్గ అభివృద్ధి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు/పెద్దవంగర: పక్కా ప్రణాళికతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. తొర్రూరు మండలంలోని 78మంది లబ్ధిదారులకు రూ.78లక్షల విలువ చేసే కల్యాణలక్ష్మి చెక్కులను సోమవారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల 51 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.26.90లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలోనే కాదు దేశమంతా యూరియా కొరత ఉందని, దానికి కేంద్రమే బాధ్యత వహించాలన్నారు. ఎన్నికల హామీ మేరకు దివ్యాంగులకు పింఛన్ పెంచాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏఎంసీ డైరెక్టర్లు అచ్చిరెడ్డి, కంచర్ల వెంకటాచారి, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, నాయకులు మోత్కూరి రవీంద్రాచారి, చిత్తలూరి శ్రీనివాస్, చెవిటి సదాకర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అశ్రద్ధ వహిస్తే చర్యలు

మహబూబాబాద్ రూరల్ : పారిశుద్ధ్యంపై అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మున్సిపల్ అధికారులతో మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ పట్టణంలో నిర్వహించే బతుకమ్మ పండుగ ఏర్పాట్ల గురించి మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకుని, ప్రతీ వీధిలోనూ లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు బతుకమ్మ ప్రాంగణంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. పట్టణంలోని వెజ్, నాన్ వెజ్ కూరగాయల మార్కెట్ కోసం రూ.90 లక్షల నిధులు మంజూరు చేయించినా ఇప్పటికీ పనులు అసంపూర్తిగా ఉండడంపై మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా ఆ పనులు పూర్తి చేయాలని, అంతేకాకుండా మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం లోపిస్తుందని, అధికారులు ఎవరైనా పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, మున్సిపల్ డీఈ ఉపేందర్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

నేడు రైల్వే అధికారుల పరిశీలన

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో నిర్మించిన మూడో రైల్వేలైన్, నూతన రైల్వే స్టేషన్ భవనం, ఎస్‌సీ–80 రైల్వే గేట్, ఇతర శాఖాపరమైన పనులను మంగళవారం కమిషన్ ఆఫ్ రైల్వే సేఫ్టీ ఉన్నత అధికారి కవిత, దక్షిణ మధ్య రైల్వే జీఎం పరిశీలన చేయనున్నారు. వారివెంట ఏజీఎం, సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని 13 ప్రత్యేక విభాగాల ప్రిన్సిపల్ హెచ్‌ఓడీలు తనిఖీకి రానున్నట్లు సంబంధిత అధికారులు సోమవారం తెలిపారు. ఉదయం ప్రత్యేక తనిఖీల అనంతరం దక్షిణ మధ్య రైల్వే ఉన్నత అధికారుల బృందం కేసముద్రం రైల్వే స్టేషన్, అక్కడి నుంచి ఇంటికన్నె రైల్వే స్టేషన్ వరకు ప్రత్యేక రైలులో ప్రయాణం చేసి మూడో రైల్వే లైన్ నిర్మించిన ప్రాంతాన్ని పరిశీలన చేసి సర్టిఫికెట్ ఇవ్వనున్నారు.



మానుకోటలో ముస్తాబైన రైల్వే మూడో లైన్

క్లుప్తంగా

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి: గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వివిధ అంశాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెల్‌ఫోన్ రిపేర్ (30రోజులు), బైక్ మెకానిక్ (30రోజులు), ఏసీ, రిఫ్రిజిరేటర్ (30రోజులు), ఎల్ఎండబ్ల్యూ డ్రైవింగ్ (30రోజుల) శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. 18 నుంచి 45ఏళ్ల వయసు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, తెల్లరేషన్, ఆధార్‌కార్డుతోపాటు విద్యార్హత జిరాక్స్ పత్రాలతో ఈనెల 25వ తేదీ లోపు సంస్కృతీ విహార్, హసన్‌పర్తిలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9704056522కు నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలకు పీఈటీ రాజ్యలక్ష్మి



వాజేడు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల పీఈటీ తెల్లం రాజ్యలక్ష్మి జాతీయ స్థాయి చెస్ పోటీలకు ములుగు జిల్లా నుంచి ఎంపికయ్యారు. ఈనెల 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఎంప్లాయీస్ రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతగా నిలిచారు. దీంతో న్యాయనిర్ణేతలు రాజ్యలక్ష్మిని జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మిని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతోపాటు పలువురు ఉద్యోగులు అభినందించారు.

రెండు బైక్‌లు ఢీ..

- జీపీ కార్యదర్శి దుర్మరణం
- రక్మీ తండా శివారులో ఘటన



వెంకట్రాం (ఫైల్)

నెక్కొండ: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ పంచాయతీ కార్యదర్శి దుర్మరణం చెందాడు. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొర్ర వెంకట్రాం (55) మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం జయపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. సోమవారం విధులు ముగించుకుని బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని రక్మీ తండా శివారులో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకట్రాంకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. మృతుడి కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆధునిక జీవనం.. సమస్యలమయం



■ దర్గాకాజీపేటకు చెందిన ఎంసీఏ విద్యార్థి అభినవ్.. కొంతకాలంగా విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడు. బిత్తర చూపులు.. పిలిస్తే పలకక పోవడం వంటి రుగ్మతలు ఉత్పన్నమయ్యాయి. తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఓ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. ఇదో మానసిక రుగ్మతగా తేల్చారు. సెల్‌ఫోన్‌లో ఇంటర్‌నెట్‌ను విపరీతంగా వినియోగించడమే ఇందుకు కారణమని గుర్తించారు. చదువుపై ధ్యాసపెట్టకుండా నిత్యం మొబైల్‌తోనే కాలక్షేపం.

■ కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందిన రాజేశ్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు.అతడి తల్లిదండ్రులు ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులే. ఈ దంపతులకు ఒక్కడే కుమారుడు కావడంతో అల్లారుముద్దుగా పెంచారు. రూ.49వేలు ఖరీదు చేసి స్మార్ట్‌ఫోన్ కొనిచ్చారు. దీంతో ఫోన్‌కు బానిసగా మారాడు. ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించాడు. బీటెక్ ప్రథమ సంవత్సరంలో ఫెయిలయ్యాడు. వైద్యుడి వద్దకు తీసుకెళ్లి చూపిస్తే..స్మార్ట్ ఫోన్ల వినియోగమే కారణమని తేలింది.

- పెరిగిన ఎలక్ట్రానిక్ పరికరాల వాడకం
- మెదడుపై తీవ్ర ప్రభావం
- యువతలో డిజిటల్ మతిమరుపు

కాజీపేట : ఇంటర్‌నెట్.. ఇదొక విప్లవాత్మక ప్రపంచం. ఉదయం నుంచి రాత్రి నిద్రించే వరకు అనేక మంది యువత మొబైల్‌లో ఇంటర్ నెట్‌పైనే ఆధారపడుతున్నారు. విద్యార్థులు సైతం నెట్‌పైనే దృష్టి సారించి విలువైన కాలన్ని వృథా చేస్తున్నారు. సమస్త సమాచారం ఇందులోనే ఉండటంతో మెదడుకు పదును పెట్టడం లేదు. ప్రతీదానికి స్మార్ట్ ఫోన్‌నే ఆశ్రయిస్తున్నారు. దీంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అనేక ఇబ్బందులతో బాధపడుతు తల్లిదండ్రులను సైతం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. మొబైల్‌తో కేవలం సమాచార సేకరణకే పరిమితం చేసుకోవాలని మానసిక నిపుణులు చెబుతున్నారు. అంతకు మించితే ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు.

అనర్థాలు ఇవి..

- స్మార్ట్ ఫోన్, ట్యాబ్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను అవసరానికి మించి వినియోగించే యువత అనేక రకాలుగా నష్టపోయే ప్రమాదం ఉంది.
- ప్రధానంగా మూడు సమస్యలు వెంటాడుతాయని వైద్యులు చెబుతున్నారు. ప్రవర్తనలో విచిత్ర మార్పు, మతిమరుపు సమస్యలే ఎక్కువ. కేన్సర్ కూడా వచ్చే అవకాశాలు లేకపోలేదు.
- ఆలోచన శక్తి పూర్తిగా తగ్గుతుంది. ఏదైనా పరిశోధనల వైపు దృష్టి సారించలేరు. ప్రతీదానికి మొబైల్ ఇంటర్‌నెట్‌నే పెద్ద దిక్కుగా భావిస్తున్నారు.
- జ్ఞాపకశక్తి తగ్గడానికి అవకాశం ఎక్కువ. మెదడులో విడుదలయ్యే డోపమిన్ అనే రసాయనంపై ఇంటర్‌నెట్ ప్రభావం అధికంగా ఉంటుంది.

వినోదానికి వినియోగిస్తా..



“స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్నా.. ఇంటర్‌నెట్ కూడా పరిమితంగానే ఉపయోగిస్తా. అవసరం వచ్చినప్పుడే మొబైల్ జోలికి వెళ్తా. ఇంటర్‌నెట్‌లో ఎక్కువగా వినోదానికి సంబంధించిన అంశాలనే చూస్తా. నా మిత్రుడు ఒకరు విపరీతంగా మొబైల్‌లో నెట్ వాడుతుండటంతో మతిమరుపు వచ్చింది. అందుకే జాగ్రత్తగా ఉంటున్నాం.

– బుర్ర మధు, ఫొటోగ్రాఫర్, కడిపికొండ

అతిగా వినియోగం ముప్పు



“మొబైల్‌లో ఇంటర్‌నెట్ అతిగా వినియోగిస్తే అనేక సమస్యలు కొని తెచ్చుకున్నట్లే. మనిషి లో ప్రవర్తన, మతిమరుపు వంటి ఇబ్బందులు ఎక్కువగా తలెత్తుతాయి. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి కూడా గణనీయంగా తగ్గుతాయి. ఏదైనా నిర్ణయం తీసుకోవడంలో తడబడుతారు.

– డాక్టర్ పరికిపండ్ల అశోక్, మానసిక నిపుణుడు

ఆరోగ్యంపై ప్రభావం..



“ఎలక్ట్రానిక్ పరికరాలు ఇప్పుడు అత్యవసరంగా మారాయి. ఫోన్‌లో విపరీతంగా మాట్లాడటమే పెద్ద పొరపాటు. దీనికితోడు ఇందులో ఇంటర్‌నెట్‌ను నిత్యం చూడటం ఇంకా ప్రమాదకరం. విద్యార్థులు, యువత వీటికి బానిసలవుతున్నారు. ఆహారం లేకపోతే ఉంటారేమో కాని, మొబైల్ లేకపోతే ఉండలేనంతగా లీనమవుతున్నారు. ఈ విపరీత ధోరణి ఆరోగ్యాలపై ప్రభావం చూపుతుంది.తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ జయకృష్ణ, వైద్యుడు, కాజీపేట

విద్యార్థిని చితకబాదిన కిరాణాషాపు యజమాని

- బాలుడికి తీవ్రగాయాలు
- అడిగేందుకు వెళ్లిన తాతపైనా దాడి..





గాయాలు చూపుతున్న విద్యార్థి ఆకాశ్, దాడిలో గాయపడిన మంగ్యా

కురవి : చాక్‌లెట్లు కొనేందుకు కిరాణా షాపునకు వెళ్లిన విద్యార్థిని దుకాణ యజమాని, ఆమె కుమార్తె చితకబాదారు. ఈ ఘటన సోమవారం మండలంలోని కంచర్లగూడెం తండాలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కురవి మండలం కంచర్లగూడెం ప్రాథమిక పాఠశాలలో గుగులోత్ ఆకాశ్ ఐదో తరగతి చదువుతున్నాడు. కొంత మంది చిన్నారులు ఏడుస్తుండడంతో హెచ్ఎం వెంకటేష్ రూ.5 ఇచ్చి ఆకాశ్‌ను చాక్‌లెట్లు తీసుకురమ్మని చెప్పాడు. దీంతో తండాలోని కిరాణా షాపునకు వెళ్లాడు. అక్కడికి వెళ్లగానే కోతుల గుంపు బాలుడిపై దాడికి యత్నించాయి. దీంతో ఆకాశ్ భయంతో షాపులోకి వెళ్లాడు. ఆ సమయంలో షాపులో యజమాని లేదు. అనంతరం యజమాని గుగులోత్ కాళీ షాపులోకి వచ్చింది. షాపులోకి రాగానే భయపడుతున్న విద్యార్థి ఆకాశ్‌ను చూసి ఎందుకు లోపలికి వచ్చావని అడగడంతో కోతులు మీదకు రావడంతో వచ్చానని చెప్పాడు. విద్యార్థి మాటలు వినకుండా గల్లాపెట్టిలోని కొంత నగదును బాలుడి జేబులో పెట్టి దొంగతనం చేసేందుకు వచ్చావని విచక్షణారహితంగా కర్రతో కొట్టింది. యజమాని కుమార్తె బానోత్ ప్రమీల సైతం బాలుడిని దారుణంగా కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. రెండు గంటలపాటు బాలుడిని షాపులో బంధించి కొట్టారు. ఆకాశ్ తమ షాపులో దొంగతనం చేసేందుకు వచ్చాడని బాలుడి తండ్రి శివలాల్‌కు యజమాని ఫోన్ చేసి చెప్పింది. తాను వచ్చి మాట్లాడుతా అని ఫోన్ పెట్టేశాడు. తర్వాత బాలుడిని విడిచిపెట్టారు. ఆకాశ్ ఇంటికి వెళ్లలేదు. దీంతో తాత మంగ్యా తన మనుమడు ఆకాశ్ ఇంటికి రాకపోయే సరికి షాపు వద్దకు వెళ్లాడు. తన మనుమడు ఎక్కడ అని అడగడంతో షాపు యజమాని కాళీ ఇటుకతో తలపై కొట్టడంతో వృద్ధుడి తల పగిలింది. బాలుడి తండ్రి శివలాల్ తండాకు చేరుకుని కురవి పోలీస్ స్టేషన్‌లో జరిగిన విషయం చెప్పాడు. శివలాల్ ఫిర్యాదు మేరకు బాలుడిని కొట్టిన గుగులోత్ కాళీ, ఆమె కుమార్తె బానోత్ ప్రమీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

ఫైనాన్సర్ల వేధింపులు భరించలేక..

- బావిలో దూకి వ్యక్తి బలవన్మరణం
- మర్రిపల్లిలో ఘటన



బ్రహ్మం(ఫైల్)

దుగ్గొండి: మధ్య తరగతి కుటుంబం.. పనిచేస్తే గాని పూట గడవదు. అప్పు భారమైంది. వేధింపులు మొదలయ్యా యి. అప్పు తీర్చే మార్గం కనిపించక బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మర్రిపల్లి గ్రామానికి చెందిన కసివోజుల బ్రహ్మం (48) తనకున్న ఎకరంన్నర భూమిలో వ్యవసాయంతోపాటు ఇంటివద్ద వెల్డింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో నాలుగు సంవత్సరాలుగా మిరప సాగు చేస్తుండగా పంట గిట్టుబాటు కాక అప్పులే మిగిలాయి. ఇదిలా ఉండగా ఏడాదిన్నర క్రితం ఇల్లు నిర్మించాడు. దీనికి ప్రైవేట్ బ్యాంకు, ఫైనాన్స్‌ల వద్ద అప్పు తెచ్చాడు. రూ. 20లక్షలు అప్పు అయ్యింది. ఇంటి నిర్మాణం పూర్తయింది. అయితే ప్రతీనెల వాయిదాలు చెల్లించలేకపోవడంతో బ్యాంకర్లు, ఫైనాన్సర్లు ఒత్తిడి తెస్తున్నారు. వీటికి తోడు గ్రామంలో కొంత మంది వద్ద అప్పు తీసుకున్నాడు. దీంతో అప్పు ఎలా చెల్లించాలని వారం రోజులుగా మదనపడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 6 గంటలకు చేను వద్దకు వెళ్లి తిరిగా రాలేదు. దీంతో 10గంటలకు బావి వద్దకు వెళ్లిన భార్య శ్రీలత తన భర్త బావిలో పడినట్లు గుర్తించింది. దీంతో బావిలో వెతికి బ్రహ్మం మృతదేహాన్ని బయటకు తీశారు. బ్రహ్మం తన నడుముకు చున్నీతో రాయి కట్టుకుని బావిలో దూకాడు. దీంతో పైకి తేలలేదు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రణధీర్‌రెడ్డి తెలిపారు.

అప్పుల బాధతో ఆటోడ్రైవర్..



అర్జున్(ఫైల్)

బచ్చన్నపేట : అప్పుల బాధతో ఓ ఆటోడ్రైవర్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని వంగా సుదర్శన్‌రెడ్డి నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చింతల అర్జున్(38) తన ఆటో మరమ్మతుకు రావడంతో మరో ఆటో కొనుగోలు చేశాడు. దీనికి తోడు తల్లిదండ్రులు కూడా కుటుంబ అవసరాలకు అప్పు చేశారు. మొత్తం సుమారు రూ. 8 లక్షల వరకు కావడంతో ఎలా తీర్చాలని కొంతకాలంగా మనస్తాపానికి గురవుతున్న అర్జున్.. సోమవారం తన వ్యవసాయ బావివద్ద ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై అబ్దుల్ హమీద్ తెలిపారు.

కడుపునొప్పితో వృద్ధురాలు..



సమ్మక్క (ఫైల్)

వెంకటాపురం(కె): కడుపు నొప్పితో ఓ వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని నేలారిపేటలో జరిగింది. ఎస్సై తిరుపతిరావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సంగం సమ్మక్క(60) రెండు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చూపించి మందులు వాడుతున్నారు. అయినా తగ్గకపోవడంతో ఆదివారం రాత్రి ఇంటి ఎదుట ఉన్న బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం ఉదయం సమ్మక్క కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా బావిలో మృతదేహం కనిపించింది. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

సర్టిఫికెట్ పోయినవి

■ బొడ భాస్కర్, S/o. శంకర్, R/o. H.No.24-5-301, దర్గా కాజీపేట్, ఫాతిమానగర్, నేను కాజీపేట్ నుండి ఫాతిమానగర్‌కి ఆటోలో వస్తుండగా నా ఇంటర్ TC సర్టిఫికేట్ పోయింది. దయచేసి ఎవ్వరికైన దొరికినచో తిరిగి ఇవ్వగలరని మనవి, ఇంటర్ TC సర్టిఫికేట్ తిరిగి ఇచ్చినవారికి తగిన బహుమతి ఇవ్వబడును. TC సర్టిఫికేట్ నెం. 7636, Date 12-11-2013 గలది. దొరికినచో ఈ నెంబర్‌కి తెలుపగలరు. సంప్ర॥ 9959212040.

[SCA25008205]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్	9705748198, 9866574715
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	7702221602
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వందేభారత్‌కు సిర్పూర్‌కాగజ్‌నగర్‌లో హాల్టింగ్

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే నాగ్‌పూర్-సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు సిర్పూర్‌కాగజ్‌నగర్ స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ సోమవారం తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి సికింద్రాబాద్-నాగ్‌పూర్ (20102) వందేభారత్, ఈ నెల 19వ తేదీ నుంచి నాగ్‌పూర్-సికింద్రాబాద్ (201010 వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు సిర్పూర్‌కాగజ్‌నగర్ స్టేషన్‌లో అధికారికంగా హాల్టింగ్ కల్పించినట్లు తెలిపారు. దీంతో కాజీపేట పరిసర ప్రాంతాల నుంచి సిర్పూర్‌కాగజ్‌నగర్‌కు వెళ్లే ప్రయాణికులకు తక్కువ సమయంలో ఎక్కువ దూరం వెళ్లేందుకు ఈ రైలు ఉపయోగపడనుంది.

ఆర్‌సీఎఫ్ యూరియా వచ్చేసింది..

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వే గూడ్స్ షెడ్‌కు 1,319.220 మెట్రిక్ టన్నుల ఆర్‌సీఎఫ్ యూరియా వచ్చింది. సోమవారం ఉదయం 10 గంటలకు చేరిన వ్యాగన్‌ను వ్యవసాయ అధికారులు విజ్ఞాన్, రవీందర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ఉమ్మడి జిల్లాలోని వరంగల్‌కు 209.22 మెట్రిక్ టన్నులు, హనుమకొండ 280, ములుగు 160, జయశంకర్ భూపాలపల్లి 220, జనగామ 230, మహబూబాబాద్ జిల్లాకు 220 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించారు. కేటాయింపుల ప్రకారం ఆయా జిల్లాలకు యూరి యా తరలింపు చేపట్టినట్లు వ్యవసాయ అధికారి రవీందర్ రెడ్డి తెలిపారు.

విశ్వేశ్వరయ్యకు రిజిస్ట్రార్ ఘన నివాళి



విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీర్స్‌డేను పురస్కరించుకుని సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం, ఆ కాలేజీ ప్రిన్సిపాల్ రమణ, టీజీఎస్పీడీసీఎల్ మాజీ డైరెక్టర్ సంధ్యారాణి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంజనీర్‌గా విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు.

ఆదివాసీ సంస్కృతి ప్రతిబింబించేలా గద్దెల విస్తరణ

- యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు
- పూజారుల నిర్ణయం మేరకే మాస్టర్ ప్లాన్
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి : ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా అమ్మవార్ల గద్దెల విస్తరణ చేపట్టనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. పూజారుల అభిప్రాయం మేరకే పనులు జరుగుతాయని స్పష్టం చేశారు. సోమవారం మేడారంలో పూజారులు, ఆర్కిటెక్, దేవాదాయశాఖ అధికారులు, కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరీశ్, పూజార్ల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావుతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన సమ్మక్క, సారలమ్మ జాతరలో 20 ఏళ్ల తర్వాత మంత్రిగా సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. గద్దెల ప్రాంగణాల్లో మార్పులు, చేర్పులు చేయడంలో భాగంగా కొద్ది రోజులుగా పూజారులతో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గొట్టు, గోత్రాలు, ఆదివాసీ ఆచారాలు, చరిత్ర, జీవన విధానాల ప్రకారం నిర్మాణ పనులు జరుగుతాయని, దీనిపై గతంలోనే ముఖ్యమంత్రి సమక్షంలో సమావేశం నిర్వహించారన్నారు. చిన్న గద్దెల మార్పిడితో అపచారం జరుగుతుందనే ప్రచారంలో వాస్తవం లేదని, పూజారుల అభిప్రాయం మేరకే పనులు కొనసాగుతాయన్నారు. గద్దెల ప్రాంతాన్ని 20 ఫీట్ల వెడల్పు, 80 ఫీట్ల పొడవుతో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. పూజారుల తుది నిర్ణయాల మేరకు మాస్టర్ ప్లాన్ రూపొందించి సీఎం ముందు ఉంచుతామని, త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూజారులతో కలిసి మేడారంలో నూతన మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించనున్నట్లు మంత్రి తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, ఆర్డీఓ వెంకటేష్, ఈఓ వీరస్వామి, పూజారులు మునిందర్, వెంకటేశ్వర్లు, రఘుపతి, రమేశ్, సారయ్య, స్వామి, గోవర్ధన్, భోజరావు, కృష్ణయ్య, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

నాన్‌బోర్డర్లు ఖాళీ చేయాల్సిందే..

- సర్క్యులర్ జారీ చేసిన హాస్టళ్ల డైరెక్టర్



విద్యార్థులతో సమావేశమైన పోలీసులు, వర్సిటీ అధికారులు

కేయూ క్యాంపస్: కేయూ హాస్టళ్లలోని నాన్‌బోర్డర్లు గదులను వేకెట్ చేయాల్సిందేనని రిజిస్ట్రార్ వి.రామచంద్రం స్పష్టం చేశారు. వర్సిటీలో శనివారం రాత్రి ఇద్దరు విద్యార్థులపై పలువురు దాడిచేసిన ఘటన అనంతరం ఆదేరోజు రాత్రి, ఆదివారం రాత్రి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు ఆందోళనలు నిర్వహించడం, ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడిన విషయం తెలిసిందే. హాస్టళ్లల్లో నాన్‌బోర్డర్ల వల్ల తలెత్తుతున్న సమస్యలపై సోమవారం సాయంత్రం పరిపాలన భవనంలోని కమిటీ హాల్‌లో అన్ని విభాగాధిపతులతోనూ, వర్సిటీ కాలేజీల ప్రిన్సిపాళ్లతో హాస్టళ్ల డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్లతో రిజిస్ట్రార్ రామచంద్రం సమావేశం నిర్వహించారు. నాన్‌బోర్డర్లు ఈనెల 17న సాయంత్రం వరకు వేకెట్ చేయాలని హాస్టళ్ల డైరెక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ సోమవారం సాయంత్రం సర్క్యులర్ జారీ చేశారు. అలుమనాక్ ప్రకారం ఈనెల 20 నుంచి మధ్యాహ్నం లంచ్ తర్వాత హాస్టళ్లను మూసివేస్తున్నట్లు సర్క్యులర్‌లో పేర్కొన్నారు. (దసరా సెలవుల నేపథ్యంలో) హాస్టళ్లలోని విద్యార్థులు నిబంధనలు పాటించకపోతే అడ్మిషన్లు రద్దు చేస్తామని కేయూ హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్ సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

విద్యార్థులతో సమావేశం

కేయూలో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో హనుమకొండ, కాజీపేట ఏసీపీలు నర్సింహారావు, ప్రశాంత్‌రెడ్డి, కేయూ పోలీస్ స్టేషన్ సీఐ రవికుమార్, ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో యూనివర్సిటీకి వచ్చారు. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, వర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ మనోహర్, కేయూ పాలకమండలి సభ్యులు సురేశ్‌లాల్ సమక్షంలో హాస్టళ్ల విద్యార్థులతో పలు అంశాలపై చర్చించారు.

శ్రాద్ధకర్మ పూజలు చేయొద్దని అభ్యంతరం

- మనస్తాపంతో పురోహితుడి ఆత్మహత్యాయత్నం
- పెట్రోల్‌తో ట్యాంకు ఎక్కి హల్‌చల్..
- కాళేశ్వరంలో ఘటన



ట్యాంకుపై ఆందోళన చేస్తున్న రాకేశ్

కాళేశ్వరం: కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద శ్రాద్ధ కర్మ పూజలు చేసేందుకు త్రివేణి తీర్థ బ్రాహ్మణ సంఘం సభ్యులంతా విశ్వబ్రాహ్మణ పురోహితుడికి అభ్యంతరం తెలుపడంతో మనస్తాపానికి గురయ్యాడు. వెంటనే పెట్రోల్ బాటిల్ తీసుకుని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుపైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని, తనకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టాడు. ఈ ఘటన జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరిగింది. పురోహితుడి తల్లిదండ్రుల కథనం ప్రకారం.. కాళేశ్వరం గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణుడు ముమ్మడి సురేశ్, రమ దంపతుల పెద్ద కుమారుడు రాకేశ్ మూడేళ్లుగా గోదావరిలో శ్రాద్ధ కర్మపూజలు చేసేందుకు వారి సమ్మతితోనే వెళ్తున్నాడు.ఈక్రమంలో సోమవారం యథావిధిగా గోదావరి వద్దకు వెళ్లాడు. అక్కడ బ్రాహ్మణ సంఘం సభ్యులందరు 'గోదావరికి నీవు రావొద్దు.. నువ్వు వస్తే నీతోపాటు మరి కొంత మంది ఇతర కులాల వారు వస్తామంటున్నారు' అని అభ్యంతరం తెలిపారు. దీంతో మనస్తాపానికి గురైన రాకేశ్ పెట్రోల్ బాటిల్ తీసుకొని మిషన్‌భగీరథ వాటర్ ట్యాంకు ఎక్కి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై తమాషారెడ్డి ఘటనాస్థలికి చేరుకుని నచ్చచెప్పే యత్నం చేసినా ససేమిరా అని గంటన్నర పాటు ఆందోళన చేపట్టాడు. తనకు యథావిధిగా పురోహిత వృత్తికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశాడు. దీంతో బ్రాహ్మణ సంఘం సభ్యులు మాడుగుల పవన్‌శర్మ, జగన్‌శర్మ, ఆరుట్ల పవన్‌చార్యులు, రఘువార్యులు.. హామీ ఇవ్వడంతో ఆ పురోహితుడు కిందికి దిగొచ్చాడు. దీంతో గొడవ సద్దుమణిగింది.

దొంగల ముఠా అరెస్ట్

- కాపర్ వైర్, పలు సామగ్రి స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్సై

కాటారం(మహాముత్తారం): మహాముత్తారంతోపాటు పలిమెల మండలంలో వరుస చోరీలకు పాల్పడిన దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం మహాముత్తారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ వివరాలు వెల్లడించారు. కాటారం మండలం దేవరాంపల్లికి చెందిన చిగురు సంతోష్, బుర్రకుంట ప్రకాశ్, జైనేని రమేశ్, షేక్ కుదరత్ ముఠాగా ఏర్పడ్డారు. కాటారం సబ్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో పగలు ఆటోలో రెక్కీ నిర్వహించి రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా ఇటీవల కాటారం మండలంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, కొయ్యూర్‌లో రెండు, పలిమెల, మహాముత్తారం ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ చొప్పున పగలగొట్టి కాపర్‌వైర్ అపహరించారు. అంతేకాకుండా మహాముత్తారం మండలంలో రోడ్డుపై ఉన్న ఎడ్ల బండి ఇనుప చక్రాలు, ట్రాక్టర్ బ్యాటరీ, మంథని మండలం ఆరెందలో పవర్ టిల్లర్‌ను చోరీ చేశారు. దీనిపై నిఘా పెట్టిన పోలీసులు పెట్రోలింగ్‌లో భాగంగా సోమవారం తెల్లవారుజామున యామన్‌పల్లి వద్ద ఆటోలో అనుమానాస్పందగా ఉన్న సంతోష్, ప్రకాశ్, రమేశ్, కుదరత్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నిందితులు చోరీలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. దీంతో వారి వద్ద నుంచి కాపర్‌వైర్, పవర్ టిల్లర్, ట్రాక్టర్ బ్యాటరీ, ఎడ్ల బండి చక్రాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సై మహేందర్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ డిప్యూటీ సీఎం 'తాటికొండ' గృహ నిర్బంధం

- హనుమకొండలో ఉద్రిక్తత
- రైతుల కోసం పాదయాత్ర కొనసాగిస్తా
- అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తా
- మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య



మాజీ డిప్యూటీ సీఎం రాజయ్యను గృహ నిర్బంధం విధించిన పోలీసులు

హన్మకొండ: మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్యను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో తాటికొండ రాజయ్య పాదయాత్ర చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం రఘునాథపల్లి మండలంలో పాదయాత్ర కొనసాగించాల్సి ఉండగా అక్కడ నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా హనుమకొండ సర్క్యూట్ హౌజ్ రోడ్‌లోని స్వగృహంలో పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీఆర్ఎస్ శ్రేణులు రాజయ్య ఇంటికి చేరుకుని సంఘీభావం తెలిపారు. సుమారు నాలుగు గంటల పాటు ఈ ఉద్రిక్తత కొనసాగింది. అనంతరం రాజయ్యను గృహ నిర్బంధం నుంచి విముక్తి చేయడంతో 12 గంటలకు సద్దుమణిగింది. అనంతరం పాదయాత్రకు వెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ నీతి వ్యాఖ్యలు మాట్లాడే స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి సిగ్గు ఉంటే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన కడియం శ్రీహరి పార్టీ మారడం ఏ విలువలకు నిదర్శనమని ప్రశ్నించారు. రాజకీయ పబ్బం గడుపుకునేందుకే పార్టీ మారాడని దుయ్యబట్టారు. తాటికొండ రాజయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ జెండాతో గెలిచిన కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. పాదయాత్ర చేస్తుంటే భయం ఎందుకని ప్రశ్నించారు. ఏ పార్టీలో ఉన్నావో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల కోసం ఆరు నూరైనా, ఎన్ని అడ్డంకులు వచ్చినా పాదయాత్ర కొనసాగిస్తానని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానన్నారు.